క్లుప్తంగా

అసోసియేట్ ప్రొఫెసర్‌గా అజయ్‌కుమార్


డాక్టర్ అజయ్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఈఎన్‌టీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బర్ల అజయ్‌కుమార్‌కు అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. విశాఖపట్నం కేజీహెచ్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఆయన విధులు నిర్వర్తించనున్నారు.

చెరువులో శివలింగం లభ్యం


కొత్తపేట చెరువులో లభ్యమైన శివలింగం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో ఉన్న ఓ చెరువులో శనివారం శివలింగం లభ్యమైంది. గ్రామానికి చెందిన కొంతమంది చెరువులో మట్టి తవ్వకాలు జరుపుతుండగా శివలింగం లభ్యమైంది. గ్రామస్తులు శివ లింగానికి పూజలు చేశారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు శివలింగం చెరువులోకి కొట్టుకువచ్చి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

కరుణాకర్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డు


గ్లోబల్ ఐకాన్ అవార్డు అందుకుంటున్న చిత్రకారుడు రేజేటి కరుణాకర్

విజయనగరం టౌన్: చిత్రకారుడు రేజేటి కరుణాకర్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియం భాస్కర్ ఆడిటోరియంలో మేఘ హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని నటుడు బాబూమోహన్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు.

ఆకట్టుకున్న భక్తిగీతాలాపన


భక్తిగీతాలాపన చేస్తున్న శ్రీవారి స్వచ్ఛంద సేవా సంఘం గాయనీ, గాయకులు

విజయనగరం టౌన్: శ్రీవారి స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో చిక్కాలవీధి రామమందిరం ఆవరణలో సంఘ వ్యవస్థాపకుడు ఎమ్.భీష్మారావు సారథ్యంలో శనివారం నిర్వహించిన భక్తిగీతాలాపన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. అన్నమాచార్య కీర్తనలు, భక్తిగీతాలతో గాయనీ, గాయకులు అలరించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు గాయకులను దుశ్శాలువతో సత్కరించారు.

తపాలాశాఖ అభ్యున్నతికి కృషిచేయాలి


నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న జీడీఎస్ ఉద్యోగులతో మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

విజయనగరం టౌన్: తపాలాశాఖ లాభాల బాటలో పయనించడానికి నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉద్యోగులు కృషిచేయాలని విజయనగరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి గ్రామీణ తపాలా ఉద్యోగుల ప్రారంభ శిక్షణ ముగింపు కార్యక్రమం హెడ్‌పోస్టాఫీస్ ఆవరణలో శనివారం జరిగింది. శిక్షణ పూర్తిచేసుకున్న జీడీఎస్ ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెడ్‌పోస్ట్ మాస్టర్ డీవీఆర్ శాస్త్రి, డిప్యూటీ పోస్టుమాస్టర్ ఎస్.శ్రీకాంత్, మాస్టర్ ట్రైనర్ పి.వి.జగన్నాథం పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి


బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్, కమిషనర్, ఇతర ఉద్యోగులు

విజయనగరం: డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతిని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ పల్లి నల్లనయ్య ఆధ్వర్యంలో శనివారం జరిగింది. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి అలుపెరుగని పోరాటం చేసిన మహా సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. 30 ఏళ్ల పాటు కేంద్రమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా సేవలందించారన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు నర్సింగ రాజు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై ముందుస్తు రాయితీ

- ఏడాది పన్ను మొత్తం ఒకే సారి చెల్లించే వారికి 5 శాతం రాయితీ
- ఏప్రిల్ 30లోపు చెల్లించే వారికి అవకాశం


నగరంలోని భవన సముదాయాలు

విజయనగరం: విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించే వారికి ఐదు శాతం రాయితీని మున్సిపల్ శాఖ ప్రకటించింది. ఈ నెల 30లోపు చెల్లించే వారికే ఈ రాయితీ అవకాశం వర్తించనుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి బకాయిలు లేని వారికి అవకాశముంటుంది. కార్పొరేషన్ పరిధిలో గడిచిన ఆర్థిక సంవత్సరంలో బకాయిలు భారీగా వసూలు కావడంతో ఎక్కువ సంఖ్యలో ఇంటి యజమానులు రాయితీకి అర్హత పొందారు.

రూ.92.15 కోట్లు వసూలు..

గత ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీతో ముగిసింది. వారం రోజుల ముందు 50 శాతం వడ్డీ రాయితీ ఇవ్వడంతో పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న పన్ను మొత్తాన్ని చెల్లించారు. కార్పొరేషన్ సిబ్బంది, ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి పన్ను వసూలయ్యేలా చూశారు. కార్పొరేషన్ పరిధిలో 70,273 అసెస్‌మెంట్‌లు ఉండగా... వాటి ద్వారా ఆస్తిపన్ను రూపంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.31.89 కోట్లు ఆదాయం పన్నుల రూపంలో రావాల్సి ఉండగా... రూ.27.33 కోట్లు వసూలు చేశారు. రూ.4.56 కోట్లు బకాయిగా మిగిలిపోయాయి. గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో వసూలు కాని మొండి బకాయిలు రూ.20.04 కోట్లు ఉండగా... కేవలం రూ.6.59 కోట్లు వసూలు చేశారు. మరో రూ.13.45 కోట్లు వసూలు కావాల్సి ఉంది. పాత, కొత్త బకాయిలు కలిపి మొత్తం 65.32 శాతం ఆస్తి పన్నులు వసూలు చేయగలిగారు.

ఏడాది పన్ను మొత్తం చెల్లిస్తే 5 శాతం రాయితీ..

ఆస్తిపన్ను క్రమం తప్పకుండా చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ ఎంతో ఊరటనిస్తోంది. ఏప్రిల్ 1 నుంచి నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమైంది. దీనికి సంబంధించిన ఆస్తిపన్ను మదింపు డిమాండ్ ఇంటి నంబర్‌పై వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అంటే మార్చి 2026 వరకు పన్ను మొత్తం చెల్లిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. బకాయిలు ఉన్నాయని మున్సిపల్ శాఖ అధికారులు వచ్చి బలవంతం చేయరు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించే వారి సంఖ్య పెరుగుతోంది. ఒక్కసారి చెల్లిస్తే వచ్చే ఏడాది వరకు పన్ను చెల్లించాలనే ఆందోళన ఉండదు. ఆ తర్వాత చెల్లించే వారికి పన్ను మొత్తంలో ప్రతినెలా రెండు శాతం వడ్డీ భారం పడనుంది. మున్సిపల్ శాఖ ఉత్తర్వుల ప్రకారం ఆస్తి పన్నులను ప్రతి 6 నెలల కోసారి చెల్లించాల్సి ఉంటుంది. సక్రమంగా ఈ ప్రక్రియ జరగకపోవటంతో ఏటా పన్నులకు వడ్డీచేరి పెద్ద మొత్తంగా బకాయిలు పడుతున్నారు. ఆస్తిదారు వాటిని చెల్లించడానికి వెనకడుగు వేస్తున్నారు.

ముందస్తు చెల్లింపులతో ఉపశమనం



2025–26 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను, ఖాళీ స్థలముల పన్నులను ఏక మొత్తంలో చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇస్తాం. ఈ నెల 30వ తేదీలోగా చెల్లించిన వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్ విధానంలో పన్నులు చెల్లించేందుకు సీడీఎంఏ.ఏపి.జీఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా, పాత డిమాండ్ నోటీసు లేదా ఇదివరకు చెల్లించిన ఆస్తి పన్ను రసీదు చూపించి పన్ను చెల్లించవచ్చు. ప్రజల సౌకర్యార్థం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశాం. చెక్కులు లేదా డీడీల రూపంలో చెల్లించేవారు సంబంధిత వార్డు సచివాలయంలో అడ్మిన్ సెక్రటరీని సంప్రదించవచ్చు.

– పల్లి నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

• వినూత్న నిరసన



కులగణన జరిగే వరకు ఎస్సీ వర్గీకరణ నిలుపుదల చేయాలంటూ జిల్లా రెల్లి సామాజిక వర్గం ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాలాజీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై కూరగాయలు అమ్ముతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తమగోడును కూటమి ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు. న్యాయం చేయకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సామాజిక వర్గ ప్రతినిధులు యర్రంశెట్టి వాలి, రామారావు, రఘు, రమణ తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం టౌన్

ముగిసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ నాయకత్వ శిక్షణ


శిక్షణలో పాల్గొన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో నాలుగురోజులుగా నిర్వహించిన నాయకత్వ శిక్షణ శిబిరం (పెట్రోల్ లీడర్స్ ట్రెనింగ్ క్యాంప్) శనివారంతో ముగిసింది. శిబిరంలో 23 పీఎంశ్రీ పాఠశాలకు చెందిన 93 మంది స్కౌట్స్ విద్యార్థులు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ పొందారు. ఫస్ట్ ఎయిడ్, కంపాస్, ఎస్టిమేషన్ ఆఫ్ హైట్, హైక్, నాట్స్, ఇన్స్‌పెక్షన్, డ్యూటీ చేంజ్ తదితర అంశాలలో నైపుణ్యం పొందినట్టు స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్ల కార్యదర్శి వాక చిన్నంనాయుడు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో నెల్లిమర్ల ఎంఈఓ ఈపు విజయకుమార్ మాట్లాడుతూ నాయకత్వ శిక్షణ పొందిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలంటే చిన్నప్పటి నుంచి పరిశీలన, అధ్యయనం, పరిశోధన, సమస్యలకు పరిష్కారం చూపడం చిన్నప్పటి నుంచి అలవాటు చేసుకోవడం అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిషన్ ప్రతినిధులు బీపీఏరాజు, వేమలి త్రినాథనాయుడు, చోడవరపు నారాయణమూర్తి, డి.ప్రవీణ్ కుమార్, ఏఎస్ఓ సీకేదుర్గా నాగేశ్వరరావు, మతల భాస్కరరావు, ఎస్.శర్మ, ఎస్మార్ట్ టీచర్లు పాల్గొన్నారు.


ఎలుగుబంటి వారి వీధిలో రామాలయం వద్ద ముగ్గులు వేస్తున్న మహిళలు



కొత్తపేట రోడ్డులో విద్యుత్‌కాంతులతో రామాలయం

శ్రీరామనవమి వేడుకలకు విజయనగరం జిల్లా కేంద్రంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాల అలంకరణతో శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి. ఆలయ ప్రాంగణాలు రంగవల్లులతో ఆకట్టుకుంటున్నాయి. దీనికి ఈ చిత్రాలే నిదర్శనం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

సీతారాములకు పట్టు వస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: శ్రీరామ నవమి సందర్భంగా రామతీర్థంలో ఆదివారం నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను శనివారం సమర్పించారు. ఆయనకు ఆలయ ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆహ్వానం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామస్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. దేవస్థాన అర్చకులు సాయిరామాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు, మల్లికార్జున శర్మ పాల్గొన్నారు.

పరామర్శ


నిర్మల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం ఎంపీటీసీ సభ్యురాలు పిన్నింటి నిర్మల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం వెంపడాం గ్రామం వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిర్మల భర్త వెంకటరమణకు మనోధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పిన్నింటి ఎల్లంనాయుడు, పిన్నింటి కుమార్, ఎం.కె.మోహన్, కొరటాన ప్రసాద్, సురేష్ రెడ్డి, కోరాడ అరుణబాబు ఉన్నారు.

ఉపాధి హామీ పథకం ఏపీఓ బదిలీ

పూసపాటిరేగ: మండల ఉపాధి హామీ పథకం ఏపీఓ ఎస్.రత్నమాల గుర్ల మండలానికి బదిలీ అయ్యారు. గుర్ల నుంచి తిరుపతిరావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్ శాంతి డెంకాడకు బదిలీ కాగా ఆమె స్థానంలో డెంకాడ నుంచి సునీత ఇక్కడికి వచ్చారు.

మోదీ నియంతృత్వ విధానాలను తిప్పికొట్టండి

- సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి బుగత అశోక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్

విజయనగరం గంటస్తంభం: భారత దేశాన్ని కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెడుతున్న ప్రధాని మోదీ నియంతృత్వ కుట్రలను అడ్డుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ పిలుపునిచ్చారు. విజయనగరం నియోజకవర్గంలో మోదీ వికృత చర్యలకు వ్యతిరేకంగా ప్రజా చైతన్య యాత్రను శనివారం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంతో 3వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పి నిరుద్యోగ యువతను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోదీ, అమిత్‌షాలు విచ్ఛిన్నకర శక్తులుగా వ్యవహరిస్తూ మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. మతం పేరుతో ప్రజలను విడదీసి అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులుగా ఆర్‌ఎస్‌ఎస్ మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పొందూరు అప్పలరాజు, బూర వాసు, తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా పవర్ ప్రాజెక్టును అడ్డుకోవాలి

- కొటియాపై అంతుపట్టని ప్రభుత్వం ఆలోచన
- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ


సమావేశంలో మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం గంటస్తంభం: ఆంధ్రప్రదేశ్–ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొటియా గ్రూపు గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం అక్రమంగా చొరబడి ఒక్కో గ్రామంలో తిష్టవేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం వెనుక అసల విషయం గిరిజనులకు అర్థం కావడంలేదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం మౌనం దాల్చడంతో ఒడిశా గిరిజన గ్రామాలను ఆక్రమిస్తూ వారిని భయకంపితులను చేస్తోందన్నారు. రాష్ట్ర అధికారులు, ప్రభుత్వంలో పెద్దల చేతగానితనం వల్ల ఒడిశా ప్రభుత్వం దిగువ సెంబి గిరిజన గ్రామం వద్ద పవర్ ప్రాజెక్టు కట్టేందుకు పూనుకుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి కొటియా వివాదాస్పద గ్రామాలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తెలపాలని భీశెట్టి డిమాండ్ చేశారు. సమావేశంలో పౌర వేదిక కార్యాదర్శి జలంత్రి రామచంద్రరాజు, పార్టీ జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆరాధ్యుడు జగ్జీవన్ రామ్

- జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

విజయనగరం అర్బన్: అణగారిన వర్గాలను అభ్యున్నతిలోకి తీసుకువచ్చిన పోరాటయోధుడు, వారికి ఆరాధ్యుడు జగ్జీవన్ రామ్ అని జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి అన్నారు. యూనివర్సిటీలో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

సత్య డిగ్రీ పీజీ కళాశాలలో....

విజయనగరం తోటపాలెం సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ఎన్‌సీసీ ఆఫీసర్లు ఎం.సత్యవేణి, ఎం.ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో...


యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

యూటీఎఫ్ జిల్లా శాఖ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు తదితరులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్టీయూ జిల్లా నాయకులు కె.జోగారావు, సూరిబాబు తదితరులు జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు.

నెల్లిమర్లలో...

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయంలో జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజు, చైర్ పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డీబీఎస్‌యూ ఆధ్వర్యంలో...

విజయనగరం టౌన్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని దళిత బహుజన శ్రామిక యూనియన్ (డీబీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు అన్నారు. జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో డీబీఎస్‌యూ కన్వీనర్ పోతురాజు, లక్ష్మి, సత్యవతి, కళావతి పాల్గొన్నారు.

- మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో జెడ్పీ మినిస్టీరియల్ హాల్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.
- స్థానిక సుంకరివీధిలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం–3లో వార్డెన్ రాధామణి ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతిని శనివారం నిర్వహించారు.

డెంకాడ: ఉప ప్రధానిగా, వివిధ మంత్రిత్వ శాఖల్లో మంత్రిగా జగ్జీవన్‌రామ్ భారత దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఏపీఎస్పీ ఐదవ బెటాలియన్ ఇన్‌చార్జ్ అడిషినల్ కమాండెంట్ జి.లక్ష్మీనారాయణ అన్నారు. చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్‌లోని యూనియన్ ఫంక్షన్ హాల్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఇన్‌చార్జ్ అడిషినల్ కమాండెంట్ లక్ష్మీనారాయణ


ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో...


నెల్లిమర్ల: జగ్జీవన్‌రామ్ చిత్రపట్టం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్ తదితరులు


బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీబీఎస్‌యూ నాయకులు చిట్టిబాబు, తదితరులు

ఉద్యమాలతోనే సమగ్రాభివృద్ధి

విజయనగరం గంటస్తంభం: ఉద్యమాలతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని వక్తలు పిలుపునిచ్చారు. సమగ్రాభివృద్ధి–అవసరాలు.. అవకాశాలు' అనే అంశంపై విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సెమినార్‌ను ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఎస్.అప్పలనాయుడు ప్రారంభించారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వీసీ ప్రొఫెసర్ కె.ఎస్.చలం, ఉత్తరాంధ్ర పట్టభద్రుల పూర్వ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, రచయిత అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరినాయుడు. డాక్టర్ జీవీఎస్ జయపాలు, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, యుటీఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము ప్రసంగించారు. నాడు విద్యలకు నిలయం.. కళల కాణాచి.. పచ్చని పంటల సమాహారం.. చెరకు, వరి, జనుము, మామిడి, జీడిపంటలకు ప్రసిద్ధిగాంచిన జిల్లాలో ఇప్పుడిప్పుడే జొన్న పంటవృద్ధి చెందుతోందన్నారు. జ్యూట్, పంచదార, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడడంతో జిల్లా ప్రగతి మందగించిందని అభిప్రాయపడ్డారు. కార్పొరేట్ వ్యాపారాలతో చిన్నాచితకా దుకాణాలు మూతపడుతున్నాయని, ఉపాధి కరువైందన్నారు. ఫార్మాకంపెనీలు సముద్రతీరంలో నీటిని కలుషితం చేసి మత్స్యసంపదకు నష్టం చేకూర్చుతున్నాయన్నారు. వ్యవసాయానికి గిట్టుబాటు ధరల్లేక, భూములు రియల్‌ఎస్టేట్ వ్యాపారుల కబంద హస్తాల్లో చిక్కుకుని పచ్చని నేల బీడుభూమిగా మారిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.


బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు